క్లుప్తంగా

నేటి నుంచి అర్తమూరులో శ్రీవారి బ్రహ్మోత్సవాలు


అర్తమూరులో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామివారు

మండపేట: అర్తమూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అందుకోసం శ్రీవారి భక్తమండలి చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ఘనంగా ఏర్పాట్లు చేసింది. ఆధ్యాత్మికతకు నిలయమైన అర్తమూరులో ఏటా శ్రీవారి బ్రహ్మోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా 400 మందికి పైగా గోవిందమాలలు ధరించి స్వామివారి సేవలో పాల్గొంటారు. ఈనెల 28వరకు నిర్వహించే వేడుకల్లో భాగంగా తొలిరోజు మాలధారణతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయని బులిస్వామిరెడ్డి తెలిపారు. 22న ధ్వజారోహణం, గరుడ ప్రసాదం వితరణ, 23న శ్రీవారి దివ్య కల్యాణం, 24న రథోత్సవం, 25న సహస్ర దీపాలంకరణ సేవ, 26న శ్రీవారి ఊంజల్ సేవ, 27న మహా పూర్ణాహుతి, 28న దీక్ష విరమణ జరుగుతాయన్నారు. రోజూ తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ విశేష పూజలు, అభిషేకాలు, సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మాలధారులకు రోజు భిక్ష, అల్పాహారం ఏర్పాటు చేస్తామని బులిస్వామిరెడ్డి తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెం శివారు దాసరపాడులో వేంచేసిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయ 32 వార్షికోత్సవం సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారిని, ఆలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. విద్యుత్ దీపాల అలంకరణ చేశారు. ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

సత్తెమ్మ తల్లికి పూజలు

బిక్కవోలు: జవ్వలదొడ్డిలో కొలువైన ఉన్న సత్తెమ్మ తల్లి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చింది. సోమవారం అమావాస్య సందర్భంగా అమ్మవారి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

ఆర్‌బీకే భవన శ్లాబు నిర్మాణం ప్రారంభం

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడి గ్రామంలో రైతుభరోసా కేంద్రం భవన శ్లాబు నిర్మాణ పనులు చేపట్టారు. పంచాయతీరాజ్ జేఈ పర్యవేక్షణలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గంటి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు సాగుతున్నాయి. రూ. 21.80 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మాణ పనులను చేపట్టామని, త్వరతిగతిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్టు జేఈ రాఘవులు తెలిపారు.

ఘనంగా చండీహోమం


చింతలూరు నూకాంబిక ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబికా అమ్మవారి ఆలయ ఆవరణలో వైభవంగా సోమవారం చండీహోమం జరిగింది. మాఘ మాస అమావాస్యని పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఉండవల్లి వీర్రాజుచౌదరి ఆధ్వర్యంలో దేవదాయశాఖ ఈ హోమాన్ని నిర్వహించింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ చండీహోమంలో సుమారు 32 మంది దంపతులు పూజలను నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని నెల రోజుల ముందుగా నిర్వహించే బుట్టగరగ కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం జరుగుతుందని ఈఓ పేర్కొన్నారు.

పళ్లాలమ్మ హుండీ ఆదాయం రూ.3.05 లక్షలు

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ అమ్మవారి దేవస్థానం హుండీ ద్వారా రూ.3,05,004 ఆదాయం వచ్చినట్టు ఈఓ బొక్కా వీరవెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీ తెరచి లెక్కించారు. డీసీసీబీ పర్సన్ బండారు రాజా, మాజీ సర్పంచ్ కామిశెట్టి అమ్మన్న, ఉప సర్పంచ్ గనిశెట్టి వీరేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్, గ్రామ పెద్దలు, వానపల్లి భజన సమాజం సభ్యులు పాల్గొన్నారు.

పరీక్షలు పదిలం

- శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా సన్నద్ధత
- క్లస్టర్ పరిధిలో 5,379 మంది విద్యార్థులు
- ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయుల కార్యాచరణ


ప్రత్యేక తరగతుల్లో పదో తరగతి విద్యార్థులు

రాయవరం: పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థులను సన్నద్ధం చేసే పనిలో ఉపాధ్యాయులు నిమగ్నం అయ్యారు. వార్షిక పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ తగిన ఏర్పాట్లు చేస్తోంది. పరీక్షల్లో ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటికే జిల్లా పరిషత్ యాజమాన్యం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.

ఇప్పటి నుంచే సిద్ధం చేస్తున్నాం



సమ్మేటివ్–1 పరీక్షలు పూర్తయ్యాయి. పరీక్షలు ఎప్పుడు నిర్వహించినా ఇప్పటి నుంచే విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా వారిని సన్నద్ధం చేస్తున్నాం.

– పప్పు శ్రీనివాసరెడ్డి, జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, రాయవరం

ఒత్తిడికి గురవకుండా..



పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఒత్తిడికి లోను కాకుండా వారిని పరీక్షలకు తయారు చేస్తున్నాం. ప్రణాళికాబద్ధంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. పబ్లిక్ పరీక్షల మాదిరిగానే సమ్మేటివ్–1 పరీక్షలను ప్రభుత్వం నిర్వహించింది. ఆ పరీక్షలు రాసిన అనుభవం వారికి ఉపకరిస్తుంది.

– పీఎస్‌బీఎస్‌కే సుందరి, జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, ద్రాక్షారామ

పరీక్షలు నిర్వహిస్తారిలా..

ఈ ఏడాది 100 మార్కుల ప్రశ్నా పత్రాలతో ఆరు సబ్జెక్టులకు ఆరు పేపర్లు మాత్రమే నిర్వహిస్తారు. గతేడాది బయలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్‌కు వేర్వేరు పేపర్లు ఉండేవి. ఈ ఏడాది రెండు కలిపి ఒకే పేపరుగా మార్పు చేశారు. అయితే ఆ రెండు సబ్జెక్టులను ఒకే పేపరు ఇస్తున్నప్పటికీ వీటికి ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా జవాబులు రాసేందుకు రెండు బుక్‌లెట్‌లను అందించనున్నారు. 10వ తరగతి పరీక్షల విభాగం ఉన్నతాధికారులు ప్రకటించిన ప్రశ్నపత్రాల నమూనా మేరకు, విద్యార్థులకు వాటిపై తగిన అవగాహన కల్పిస్తున్నారు.

క్లస్టర్‌లో 5,379 మంది విద్యార్థులు

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని కపిలేశ్వరపురం, మండపేట, రాయవరం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో 5,379 మంది పదో తరగతి విద్యార్థులు చదువుతున్నారు.

ఆటంకాలు లేకుండా ఉండాలని..

గతేడాది జూలై నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ప్రభుత్వం ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఇప్పటికే ఎఫ్‌ఏ–1, ఎఫ్‌ఏ–2, ఎస్‌ఏ–1 పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల ఆధారంగా చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా సీ, డీ గ్రేడ్ విద్యార్థులను ఏ, బీ గ్రేడ్ విద్యార్థులతో పోటీ పడేలా తీర్చిదిద్దేందుకు పాఠశాలల్లో ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు.

మహా రుద్రయాగంలో ఎమ్మెల్సీ తోట


ఎమ్మెల్సీ త్రిమూర్తులను స్వాగతిస్తున్న రుద్రయాగ కమిటీ


ప్రత్యేక అలంకరణలో బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి

రాయవరం: సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహారుద్రయాగంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోమవారం పాల్గొన్నారు. ఈ నెల 12 నుంచి సోమేశ్వరంలో పంచాయతన సహిత మహా రుద్రయాగం నిర్వహిస్తున్న విషయం విదితమే. ఎమ్మెల్సీ త్రిమూర్తులు సతీ సమేతంగా సోమేశ్వరస్వామి పూజాదికాలు, అభిషేకాలు నిర్వహించాక యాగంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ సోమేశ్వరం గ్రామస్తులు ఒకే తాటిపైకి వచ్చి లోక కల్యాణార్థం మహా రుద్రయాగాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. తొలుతగా మహా రుద్రయాగ కమిటీ ఎమ్మెల్సీ త్రిమూర్తులను పూర్ణ కుంభంతో స్వాగతించారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. మహా రుద్రయాగంలో భాగంగా తొమ్మిదవ రోజు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. వందమంది వేద పండితులు మహా రుద్రయాగాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. రుద్రయాగ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఎలుకల నివారణకు శాస్త్రీయ పద్ధతి మేలు

రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ కార్యాలయ పరిశీలకుడు వెంకటేశ్వర్లు


టేకి రైతు భరోసా కేంద్రంలో రైతులకు సూచనలు చేస్తున్న వెంకటేశ్వర్లు

కపిలేశ్వరపురం: వ్యవసాయ క్షేత్రంలో ఎలుకల నివారణకు శాస్త్రీయ పద్ధతులు మేలు చేస్తాయని వ్యవసాయ శాఖ ఆర్‌బీకే విభాగం డీడీఏ డి.వెంకటేశ్వర్లు అన్నారు. ఎలుకల నివారణ మందు పంపిణీ ప్రక్రియ పరిశీలకులుగా రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ కార్యాలయ పరిశీలకుని హోదాలో సోమవారం ఆయన మండలంలోని టేకి ఆర్‌బీకేను సందర్శించారు. మండలంలో ఎలుకల మందు పంపిణీ తీరును ఏఓ కేవీఎస్ రమేష్‌కుమార్, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి ఆయనకు వివరించారు. డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఎలుకల బొరియలు వద్ద బ్రోమోడయోలిన్ మందును ఒకేరోజు సామూహికంగా అమర్చడం ద్వారా సత్ఫలితాలొస్తాయన్నారు. పంటపై ఎలుకల ప్రభావాలపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

తదుపరి పంట సమయానికి రైతుల సూచనలను పరిగణనలోకి తీసుకుని నాట్లు వేసిన 25 రోజుల్లోగా బ్రోమోడయోలిన్ పంపిణీ చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ ఉచిత పంపిణీతో పాటు రైతు భరోసా కేంద్రంలో బ్రోమోడయోలిన్ మందును సాధారణ విక్రయానికి కూడా అందుబాటులో ఉంచాలని రైతులు సూచించగా ఆ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆయన వెంట ఆత్మ పీడీ జ్యోతిర్మయి, డీఆర్‌సీ ఏఓ మనోహర్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, సొసైటీ చైర్మన్ మట్టపర్తి పాల్‌రాజ్, ఏఓ కేవీఎస్ రమేష్ కుమార్, వ్యవసాయ సహాయకులు జి. హరిబాబు ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


ఇటుకబట్టీల వద్ద న్యాయ అవగాహన కల్పిస్తున్న న్యాయవాది సత్యనారాయణ

రామచంద్రపురం: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ న్యాయవాది దొమ్మలపాటి సత్యనారాయణ సూచించారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్ కె.మాధవీదేవి ఆదేశాల మేరకు న్యాయ అవగాహన సదస్సులను సోమవారం నిర్వహించినట్లు సత్యనారాయణ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా సంఘాలు, పట్టణ శివార్లలో ఇటుకల బట్టీ కార్మికులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ హక్కులు, విధులు సామాజిక బాధ్యతలు పాటించాలన్నారు. రాజ్యాంగానికి బద్ధులై ఉండాలని మహిళలు హక్కుల కోసం పలు చట్టాలపై అవగాహన కల్పించామన్నారు. ఇటుక బట్టీల్లో పని చేసే వారు పిల్లలను చదివించాలని, అలాగే పని విషయంలో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే కేసులు పెట్టే అవకాశం ఉందన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఉచితంగా న్యాయ సలహాలను అందించేందుకు మండల న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించవచ్చని వివరించారు.

ఆర్యావటంలో వరుస చోరీలు


ఆర్యావటంలో చోరీ జరిగిన షాపు వద్ద విచారణ నిర్వహిస్తున్న పోలీసులు

కాజులూరు: గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్యావటంలో ఇటీవల వరుస చోరీలు జరుగుతున్నాయి. సోమవారం ఆర్యావటంలో రెండుచోట్ల, గొల్లపాలెంలో ఒక చోట దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామంలోని పాథమిక సహకార సంఘ భవనం షాపింగ్ కాంప్లెక్స్‌లోని వీరగోపాలకృష్ణ మెడికల్స్ షాపులో దొంగలు చోరీ చేశారు. ఉదయం షాపు తెరిచేందుకు వచ్చిన షాపు యజమాని చందాల కిశోర్ అప్పటికే షట్టరు తాళం తెరచి ఉండటంతో లోనికి వెళ్లి చూశారు. గల్లా పెట్టెలోని రూ.17 వేలు నగదు దొంగిలించిన దొంగలు, ఇంకా ఏమైనా నగదు దొరుకుతుందేమోనని సొరుగులు, ఇతర ఫర్నిచర్ ధ్వంసం చేశారు. అలాగే గ్రామంలో ట్రాన్స్‌కో ఆఫీస్ ఎదురుగా ఉన్న కార్తికేయ క్లాత్ షోరూమ్‌లో, గొల్లపాలెం కోళ్ల తూము సెంటర్‌లోని బిరుదాస్ సెలక్షన్స్ బట్టల షాపులోనూ దొంగలు చోరీకి చొరబడ్డారు. ఈ రెండు షాపుల్లోనూ యజమానులు డబ్బులేమి ఉంచకపోవటంతో చోరులకు ఏమీ చిక్కలేదు. విషయం తెలుసుకున్న గొల్లపాలెం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వరుస చోరీలతో గ్రామస్తులు ఆందోళనలకు గురవుతున్నారు. రాత్రయితే గ్రామంలో ఏ పక్కన ఏ దొంగతనం జరుగుతుందోనని స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ విప్లవాత్మక మార్పులను తెలపండి

మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ


వెంకటాయపాలెంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణలో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకు వచ్చిన విప్లవాత్మక మార్పులతో ప్రస్తుతం ఉన్న పరిస్థితిని, మన ప్రభుత్వానికి ఉన్న పరిస్థితిని బేరీజు వేస్తూ వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలకు జరుగుతున్న మేలును ఎప్పటికప్పుడు గుర్తు చేస్తూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పిలుపు ఇచ్చారు. మండలంలోని వెంకటాయపాలెం మాధవానందన ఫంక్షన్ హాలులో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఒమ్మి రఘురాం నేతృత్వంలో జరిగిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణలో మంత్రి వేణు పాల్గొన్నారు. మంత్రి వేణు మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో నాటికి, నేటికీ కనిపిస్తున్న మార్పు, పేదల ఆరోగ్యం కాపాడడానికి ఆసుపత్రుల్లో నాటికీ, నేటికీ వచ్చిన మార్పు, పాలనలో వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ పాలనను ఇంటి ముంగిటకు చేర్చిన మార్పు, రైతులు, ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు అందరికీ పాలనలో భాగస్వామ్యం కల్పిస్తున్న జగనన్న తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను నిత్యం ప్రజలకు తెలియజేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా కన్వీనర్లు, గృహ సారథులు పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ పరిశీలకుడు ఒమ్మి రఘురాం కన్వీనర్లు, గృహ సారథుల విధి, విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ టేకుమూడి సుజాత, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పలివెల నాగరాజు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఆధార్ సేవల్లో 'ఇనుమర్తి'కి జిల్లా రెండో స్థానం


అమలాపురంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న మల్లేశ్వరరావు

కపిలేశ్వరపురం: ఆధార్ నవీకరణ విధుల్లో విశేష సేవలు అందించిన కపిలేశ్వరపురం– 1 సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ ఇనుమర్తి వీరమల్లేశ్వరరావు (అంగర) జిల్లాలో రెండో స్థానంలో నిలిచారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా మల్లేశ్వరరావు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. జిల్లాలో 60 సచివాలయ ఆధార్ కేంద్రాలు ఉండగా అత్యధిక మందికి ఆధార్ నవీకరణ చేసిన వారిలో ఐదుగురుని ఉత్తమ సేవకులుగా ఎంపిక చేశారు. జిల్లాలోని ఐదుగురులో 2,368 మందికి నవీకరణ చేసిన వీరమల్లేశ్వరరావు రెండో స్థానంలో నిలిచారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ, సహచర ఉద్యోగులు మల్లేశ్వరరావును అభినందించారు.

సహాయకుల సంఘాధ్యక్షుడిగా రాజేష్


జిల్లా పశు సంవర్ధక శాఖ సహాయకుల అసోసియేషన్ కార్యవర్గం

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పశు సంవర్ధక శాఖ సహాయకుల అసోసియేషన్ అధ్యక్షుడిగా గజ్జా రాజేష్ సోమవారం ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ మౌషి రాయవరంలో విలేకరులకు తెలిపారు. ఏపీఎన్‌జీవీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా చైర్మన్ శ్రీనివాసచౌదరి, ఎన్నికల అధికారి రామారావు నేతృత్వంలో ఎన్నికలు నిర్వహించారు. కోనసీమ జిల్లా అధ్యక్ష ఎన్నికల్లో రాజేష్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. మిగిలిన కార్యవర్గం మాత్రం ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు మౌషి తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులుగా మట్టా తమ్మయ్యగౌడ్, పల్లి దుర్గారావు, ఉండుర్తి రవితేజ, అసోసియేషన్ అధ్యక్షుడిగా పి.ప్రకాష్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కె.శివనాగేంద్ర, జాయింట్ సెక్రటరీలుగా కె.సన్యాసిరావు, చిక్కా శేషసాయి, కోశాధికారిగా జి.గాందీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ఈ ఎన్నికల్లో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్, ప్రధాన కార్యదర్శి వినీత్, కోశాధికారి అన్వర్‌భాషాలు పాల్గొన్నారు.

సామూహిక చర్యలతో మూషిక సంహారం

- రైతులకు బ్రోమోడయోలిన్ మందు పంపిణీ
- మందు వినియోగంపై వ్యవసాయశాఖ సూచనలు


గొల్లపాలెం ఆర్‌బీకే వద్ద వ్యవసాయశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఎరను తయారు చేస్తున్న రైతులు


దంగేరులో ఎలుక కన్నాల వద్ద ఎర తయారీపై అవగాహన కల్పిస్తున్న డీడీఏ వెంకటేశ్వర్లు


వెంటూరులో ఎలుకల నివారణ మందును రైతులకు పంపిణీ చేస్తున్న ఏవో


జగన్నాయకులపాలెం ఆర్‌బీకే వద్ద రైతులకు మందు అందజేస్తున్న ఏఓ

కాజులూరు: పంటలపై ఎలుకల దాడి రోజురోజుకీ అధికమవుతోంది. మూషికాలు పొలాల్లో విజృంభిస్తూ వరి దుబ్బులను మొదళ్లకు కొరికి పారేస్తున్నాయి. చీడపీడలను నివారిస్తూ ఎరువులు వేసి ఏపుగా పెంచిన వరిపంట ఎలుకల దాడికి నాశనమవుతుంటే రైతులు లబోదిబోమంటున్నారు. వాటి నివారణకు ఎన్నిచర్యలు చేపట్టినా ఫలితం నామమాత్రంగానే ఉంటుంది. బుట్టలు పెట్టి పట్టినా.., బొరియల్లో పొగపెట్టినా.., మందులు ఎన్నివాడినా ఎలుకల ఉధృతి తగ్గటం లేదు. ఎలుకల నిర్మూలనకు అధికంగా ఖర్చు అవటమే కాకుండా ఎలుకలు దాడికి గురైన పొలంలో ఎకరానికి 10 బస్తాల వరకు దిగుబడి తగ్గి పోతుందని రైతులు చెబుతున్నారు. అయితే రైతులు సామూహిక ఎలుకల నిర్మూలన చర్యలు చేపడితే ఫలితం ఉంటుందని కాజులూరు మండల వ్యవసాయ అధికారి(ఏవో) వి.అశోక్ తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గంలో మొత్తం 56 వేల ఎకరాల్లో ఈ ఏడాది వరి సాగవుతుండగా కాజులూరు మండలానికి 86 కేజీలు, రామచంద్రపురం మండలానికి 84 కేజీలు, కె.గంగవరం మండలాలకు 86 కేజీలు చొప్పున బ్రోమోడయోలిన్ మందు విడుదలయింది. వాటిని వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు పంపిణీ చేస్తూ ఉపయోగించే విధానాలపై అవగాహన కల్పిస్తున్నారు.

మందుతయారీ, వాడే విధానం..

ఎలుకల నిర్మూలనకు రైతులు 480 గ్రాముల నూకలు, పది గ్రాముల నూనె, పది గ్రాముల బ్రోమోడయోలిన్ మందు కలిపి మందు ఎరను తయారు చేసుకోవాలన్నారు. ముందుగా నూకలను పేపరుపై వేసి నూనె పోసి కలపాలి. ఆపై బ్రోమోడయోలిన్ మందును వేసి నూనె కలిపిన నూకలకు పట్టించాలన్నారు. ఈ మందును మూడు అంగుళాల వ్యాసం, 18 అంగుళాల పొడవు కలిగిన పీవీసీ పైపులలో 30 గ్రాములు చొప్పున వేసి పొలానికి నాలుగు మూలలా గట్లపై అమర్చుకోవాలి. వారానికి రెండుసార్లు తాజాగా తయారు చేసిన ఎరను మార్చుకోవాలన్నారు. పీవీసీ పైపులు వాడటం వలన విషపు ఎర ఎండా, వానలకు పాడవకుండా ఉండటమే కాకుండా పక్షులు, పెంపుడు జంతువులకు అందకుండా మెరుగైన ఫలితాలను ఇస్తుందని ఏవో అన్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న ఎలుక మందును రైతులందరూ సామూహికంగా వాడితే మంచి ఫలితాలు వచ్చి ఎలుకలను నియంత్రించవచ్చని గుంటూరు కమిషనర్ కార్యాలయ పరిశీలకులు, ఆర్‌బీకే డీడీఏ డి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలో 26 గ్రామ సచివాలయాల వద్ద సోమవారం సామూహిక ఎలుకల నిర్మూలనలో భాగంగా రైతులకు ఎలుకల మందును పంపిణీ చేశారు. దంగేరు ఆర్‌బీకే వద్ద జరిగిన కార్యక్రమంలో డీడీఏ వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ కోనసీమ జిల్లాకు 863 కేజీల ఎలుకల మందును పంపిణీ చేశామని అన్నారు. సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఏడీఏ జయరామలక్ష్మి, మండల వ్యవసాయ సలహా కమిటి చైర్మన్ ఇళ్ల సూర్యనారాయణ, ఏఓ రవి, వ్యవసాయ సహాయకులు శ్రీరామచంద్రమూర్తి, రాజవంశీ, కళ్యాణ్, దారా సత్యనారాయణ, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాయవరం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వెంటూరు గ్రామంలో సోమవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు అక్కడి రైతు భరోసా కేంద్రం వద్ద నిర్వహించిన అవగాహనా సమావేశంలో ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ మాట్లాడుతూ ఎలుకల జీవిత చక్రం, అవి పంటకు కలిగించే నష్ట పరిమాణాన్ని వివరించారు. అనంతరం ఎలుకల మందును వరి నూకలతో కలిపి చూపించారు. సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టినప్పుడే ఫలితం ఉంటుందన్నారు. ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన బ్రోమోడయలిన్ మందును ఎరతో కలిపి ప్రతి రైతుకూ 10 గ్రాముల వంతున పొట్లాలు కట్టి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని 19 గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద సోమవారం ఎలుకల నివారణ నిమిత్తం రైతులకు బ్రోమో డయోలిన్ మందును పంపిణీ చేశారు. వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ పర్యవేక్షణలో ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు వ్యవసాయ క్షేత్రాల్లో ఎలుకల బొరియలను గుర్తించి మందును అమర్చడంలో రైతులకు ప్రయోగాత్మకంగా సూచనలు చేశారు.

రామచంద్రపురం రూరల్‌లో..

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం 100 శాతం పూర్తి ఉచితంగా అందిస్తున్న ఎలుకల నివారణ మందు బ్రోమోడయోలిన్‌ను గ్రామంలో ఒకేసారి రైతులంతా ఉపయోగించడం వల్ల పూర్తి స్థాయిలో ప్రయోజనాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ రైతులకు వివరించారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద సామూహిక ఎలుకల నివారణలో భాగంగా ఎలుకల మందును సోమవారం రైతులకు అందించారు. మండలంలోని జగన్నాయకులపాలెంలో మందును రైతులకు అందించి స్వయంగా ముందు రోజు గుర్తించిన బొరియల వద్దకు రైతులతో చేరుకుని మందును ఆ బొరియల్లో పెట్టి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు సాదే రాజేష్, వీఆర్‌ఓ సత్యగౌరి, వీఆర్‌ఏ లోవరాజు, అనిశెట్టి దొరబాబు, రైతులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయానికి టీకాలు అందించాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల ఉప కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలు వేశారు. చిన్నారులకు పలు వ్యాధులు రాకుండా వ్యాక్సిన్లు వేశారు.